ముస్సిపల్ కమిషనర్‌కు వినతి

కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ మేయర్ రవీందర్‌సింగ్

కార్పొరేషన్, డిసెంబర్ 21: కరీంనగర్ నగరపాలక సంస్థలో సీఎం అస్యూరెన్స్ నిధులు రూ. 133 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని మాజీ మేయర్ రవీందర్‌సింగ్ గురువారం మున్సిపల్ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, తిరుపతి తదితరులున్నారు.

ఖాదీ వస్త్రాల కొనుగోళ్లపై ప్రత్యేక తగ్గింపు

హౌసింగ్‌బోర్డు కాలనీ, డిసెంబర్ 21: క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతిని పురస్కరించుకొని కరీంనగర్‌లోని కమాన్ నుంచి రూరల్ పోలీస్ స్టేషన్ రోడ్డులో గల మెట్‌పల్లి ఖాదీ భవన్‌లో వచ్చే నెల 31వ తేదీ వరకు ఖాదీ వస్త్రాల కొనుగోళ్లపై 40% ప్రత్యేక తగ్గింపు ఇస్తున్నట్లు సంస్థ చైర్మన్ కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఖాదీ భవన్ మేనేజర్ భిక్షపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించి నేత కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు.

ఆంగ్ల భాషలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

హౌసింగ్ బోర్డుకాలనీ, డిసెంబర్ 21: విద్యార్థులు ఆంగ్ల భాషలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ సూచించారు. జిల్లా కేంద్రంలోని కళాశాలలో ఆంగ్ల భాషలో నైపుణ్యం సాధించడానికి గురువారం విద్యార్థులకు మెలకువలను నేర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. ఆంగ్లభాషపై పట్టు సాధించడానికి గానూ విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అధ్యాపకుడు సాగర్, ఏవో శ్రావణ్ కుమార్, ఏసీవో సంపత్ కుమార్, రామేశ్వర్ రావు పాల్గొన్నారు.

29న జిల్లా స్థాయి యువజనోత్సవాలు

గంగాధర, డిసెంబర్ 21 : జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 29న జిల్లాస్థాయి యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జాతీయ యువజన అవార్డు గ్రహీత రేండ్ల కళింగ శేఖర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. బృంద, వ్యక్తిగత విభాగాల్లో జానపద నృత్యం, గీతం,, కథా రచన, పోస్టర్ మేకింగ్, ప్రకటన, ఫొటోగ్రఫీ అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. 15 నుంచి 29 ఏళ్ల యువత ఆధార్ కార్డు, పదో తరగతి మెమో, జనన ధ్రువీకరణ పత్రంతో బయోడేటాను కరీంనగర్ యువజన సర్వీసుల కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు సెల్ నంబర్లు 99498 50360, 96409 67943, 89852 75068 లో సంప్రదించాలని సూచించారు.

ఆరోపణలు నిరూపించాలి

- లేకపోతే క్షమాపణ చెప్పాలి
- మాజీ మేయర్ రవీందర్ సింగ్‌కు మేయర్ సునీల్‌రావు సవాల్

మాట్లాడుతున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు, పక్కన కార్పొరేటర్లు

కార్పొరేషన్, డిసెంబర్ 21: బల్దియాలో రోడ్లు వెయ్యకుండా బిల్లులు చెల్లించారని ఆరోపించిన మాజీ మేయర్ రవీందర్‌సింగ్ అవి ఎక్కడో చేశామో నిరూపించాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు సవాల్ చేశారు. ఆరోపణలను నిరూపించకపోతే టవర్‌సర్కిల్‌లో క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎస్‌బీఎస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019లో మొదటి ఫేస్ కింద రూ.112 కోట్లతో రోడ్లు, రూ.118 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు, రూ.16 కోట్లతో స్పోర్ట్స్ పనులు, రూ.64 కోట్లతో హౌసింగ్‌బోర్డుకాలనీలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. తమ పాలకవర్గం వచ్చే నాటికి స్మార్ట్‌సిటీ పథకంలో కమాన్ చౌరస్తా సుందరీకరణ పనులకు రూ.24 లక్షలు వ్యయం చేశారన్నారు. తాము నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడా పనులు నిర్వహించలేదన్నారు. స్మార్ట్‌సిటీలో చేపట్టిన పనులన్నింటినీ ఎన్ఐటీ వరంగల్ పరీక్షలు చేస్తుందని, అలాగే, థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ పరీక్షలు చేసిన తర్వాతనే బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. స్మార్ట్‌సిటీ కింద ఇప్పటి వరకు రూ.934 కోట్ల పనులకు టెండర్లు చేపట్టి ప్రారంభించామని, వీటిలో ఇప్పటి వరకు రూ.514 కోట్ల బిల్లులు చెల్లించడం జరిగిందన్నారు. ఈ పనుల్లో రూ.130 కోట్లు చేతులు మారాయని విమర్శించారని, అవి ఎక్కడ జరిగాయో నిరూపించాలని డిమాండ్ చేశారు. అధికారులు నిబంధనల మేరకు పని చేస్తుంటే ఇప్పుడు అబండాలు వేయడం సరికాదన్నారు. టవర్‌సర్కిల్‌లో స్మార్ట్‌సిటీ కింద చేపట్టిన పనుల్లో అన్ని ఇండ్ల వెల్‌వేషన్ ఒకే తీరులో ఉండాలన్న ఆలోచన చేసిన మేధావి రవీందర్‌సింగ్ అని విమర్శించారు. ఎవరైన ఉన్న ఇండ్ల వెల్‌వేషన్ కూలగొట్టి ఒకే తీరులో నిర్మించుకోవడానికి సిద్ధంగా ఉంటారా అని ప్రశ్నించారు. అది కూడా ఆలోచించని తీరు ఆ నాయకుడిదని దుయ్యబట్టారు. ఈ ఎన్నికల్లో వెన్నుపోటుదారులు ఎంత మంది పని చేసినా ప్రజలు తమకు అండగా నిలిచి ఎమ్మెల్యేను గెలిపించారని పేర్కొన్నారు. పార్టీకి నష్టం జరిగేలా వ్యవహరిస్తున్న రవీందర్‌సింగ్‌పై పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. తాము నగర అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఎలాంటి విచారణ జరిపినా తాము సిద్ధమేనని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు వాల రమణారావు, చాడగొండ బుచ్చిరెడ్డి, గంట కళ్యాణి, కంసాల శ్రీనివాస్, గందె మాధవి, నాంపెల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పాఠశాలకు చేయూతనివ్వాలి

మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

తిమ్మాపూర్, డిసెంబర్21: స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక దివ్యాంగుల పాఠశాలకు ఆర్థికంగా చేయూతనివ్వాలని ట్రస్ట్ చైర్మన్ చాడ వెంకటరెడ్డి కోరారు. మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల మానసిక దివ్యాంగుల పాఠశాలలో గురువారం నిర్వహించిన ట్రస్ట్ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఈ పాఠశాల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వ నిధులతో పాటు దాతల విరాళాలు అందేవన్నారు. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో నిధులు రావడం లేదన్నారు. దీంతో పాఠశాల నిర్వహణ కష్టంగా మారిందని చెప్పారు. విరాళాల కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ట్రస్ట్ నిర్ణయం తీసుకుందని చెప్పారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్ట్ సభ్యులు బొజ్జపురి వెంకటయ్య, రమణారెడ్డి, కొమెర ఎల్లారెడ్డి, సముద్రాల జనార్దన్‌రావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మెప్మా కార్యక్రమాలపై కమిషనర్ సమీక్ష

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 21: మున్సిపల్ కార్యాలయంలో గురువారం మెప్మా కార్యక్రమాలపై కమిషనర్ సమ్మయ్య ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ హుజూరాబాద్ ఫస్ట్ ట్రంచ్, సెకండ్ ట్రంచ్, థర్డ్ ట్రంచ్ రుణాలను బ్యాంకుల ద్వారా చిరు వ్యాపారులకు ఇప్పించారన్నారు.హుజూరాబాద్‌లో ఈ నెల 27 నుంచి జనవరి 3 వరకు వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహిస్తారని వెల్లడించారు. ఇక్కడ మెప్మా డీఎంసీ శ్రీవాణి, ఏడీఎంసీ మానస, సీఎల్ ఆర్పీలు రమాదేవి, స్వరూప, టీఎల్ఎఫ్ ఆర్పీ అనూష పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

యువకుడిని పరీక్షిస్తున్న డాక్టర్ వివేకానంద

విద్యానగర్, డిసెంబర్ 21: కరీంనగర్‌లోని శ్రీసాయి లైఫ్ లైన్ హాస్పిటల్‌లో గురువారం నిర్వహించిన తుంటి, కీళ్లనొప్పుల ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. హైదరాబాద్ హెచ్ఆర్‌సీ హాస్పిటల్ మోకీలు, తుంటి మార్పిడి, ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు డాక్టర్ వివేకానంద సుమారు 150 మందిని పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో లైఫ్ లైన్ హాస్పిటల్ చైర్మన్, జనరల్ సర్జన్ డాక్టర్ సీహెచ్ ప్రదీప్ కుమార్, దవాఖాన ముఖ్య కార్యనిర్వహణాధికారి, రెడియాలోజిస్ట్ కంచన్ పాల్గొన్నారు.

లబ్ధిదారుకు కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎంపీపీ ముద్దసాని సులోచన

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మానకొండూర్, డిసెంబర్ 21: మండలంలోని 59 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎంపీపీ ముద్దసాని సులోచన గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఇక్కడ జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, తహసీల్దార్ రాజు, ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేశ్వర్‌రావు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులున్నారు.

కేక్ కట్ చేసి.. అభిమానం చాటి

హుజూరాబాద్‌టౌన్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేస్తున్న ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు

హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్ 21: హుజూరాబాద్ పట్టణంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు. ఏరియా దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల, పార్టీ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు, కౌన్సిలర్ రమాదేవి పాల్గొన్నారు.

ఇల్లందకుంటలో..

ఇల్లందకుంట, డిసెంబర్ 21: మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ పావని-వెంకటేశ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కొమురెల్లి, ఎంపీటీసీలు విజయకుమార్, ఓదెలు, చిన్నారాయుడు, సర్పంచులు రాజిరెడ్డి, రాజు, మానస-మహేందర్ ఉన్నారు.

వీణవంకలో..

వీణవంక, డిసెంబర్ 21: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఇక్కడ ఎంపీపీ రేణుకాతిరుపతిరెడ్డి, జడ్పీటీసీ వనమాల-సాధవరెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ గంగాడి తిరుపతిరెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఎక్కడి రఘుపాల్‌రెడ్డి, సర్పంచులు పర్లపల్లి రమేశ్, మోరె సారయ్య, పోతుల నర్సయ్య, బండ సుజాతాకిషన్‌రెడ్డి, ఉప సర్పంచ్ భానుచందర్, గ్రామాధ్యక్షుడు తాళ్లపల్లి మహేశ్‌గౌడ్, నాయకులు గంగారెడ్డి, జితేందర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, గెల్లు మల్లయ్య, రాములు, మ్యాడగోని తిరుపతిగౌడ్, నీల శ్రీకాంత్, మర్రి రవీందర్, నీల పూర్ణచందర్, ఎల్బాక సతీశ్, చింతల సుమన్, పైడిమల్ల సాహిత్, రాజకుమార్ పాల్గొన్నారు.

జమ్మికుంటలో..

హుజూరాబాద్‌టౌన్(జమ్మికుంట), డిసెంబర్ 21: జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఇక్కడ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు టంగుటూరి రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, డిసెంబర్ 21: నగరంలో శుక్రవారం 33కేవీ లైన్ పనులు చేపడుతున్నందున 11కేవీ వెంకటసాయి ఫీడర్ పరిధిలోని లక్ష్మీనగర్, వాసవీకాలనీ, రాఘవేంద్రనగర్, వందన అపార్ట్ మెంట్స్, స్కాలర్స్ స్కూల్ ఏరియాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1 ఏడీఈ నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, సంతోష్‌నగర్, బాలాజీ సూపర్ మార్కెట్ ఏరియా, సెయింట్ జాన్స్ స్కూల్ ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ సుధీర్ కుమార్ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆరోపణలపై అధికారి విచారణ

శంకరపట్నం, డిసెంబర్ 21: మెట్‌పల్లి సింగిల్ విండో సీఈవో సదయ్యపై అవినీతి ఆరోపణలు రావడంపై కేడీసీసీ బ్యాంక్ విచారణాధికారి కరుణాకర్ గురువారం విచారణ జరిపారు. మెట్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో సదయ్య డెయిరీ సబ్సిడీ మంజూరు చేయిస్తానని తన వద్ద రూ. 80 వేలు తీసుకున్నాడని రైతు మందాడి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఈ ఆరోపణల మేరకు డీసీవో విచారణకు ఆదేశించగా, కరుణాకర్ మెట్‌పల్లి సింగిల్ విండో కార్యాలయంలో రైతు మందాడి శ్రీనివాస్‌రెడ్డితో పాటు సీఈవో సదయ్యను విచారించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు విచారణాధికారి తెలిపారు.

పన్నులు చెల్లించాలి

హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్ 21: హుజూరాబాద్ పట్టణ ప్రజలు పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధి కోసం సహకరించాలని మున్సిపల్ కమిషనర్ సల్వాది సమ్మయ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. పట్టణంలో మిషన్ భగీరథ, మామూలు నల్లా కలెక్షన్లు కలిపి మొత్తం 10,041 ఉన్నాయని చెప్పారు. 2023-24 సంవత్సరానికి రూ.74,120 నల్లా పన్నుల బకాయిలు ఉన్నాయని వెల్లడించారు. పాత నల్లా పన్నులు రూ. కోటి 38 లక్షల 97,210 ఉన్నాయని చెప్పారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తిరుపతి రావు

తిరుపతి రావు

హౌసింగ్‌బోర్డు కాలనీ, డిసెంబర్ 21: రామడుగు మండలం వెలిచాల గ్రామ పంచాయతీ పరిధిలోని గుడ్డెలుగులపల్లి పాఠశాల ఉపాధ్యాయుడు పిన్నింటి తిరుపతి రావు రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఆర్ శ్రీనివాస్, కట్టా రవీంద్ర చారి తెలిపారు. తిరుపతి రావు మాట్లాడుతూ, తన ఎన్నికకు సహకరించిన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఆర్ శ్రీనివాస్, కట్టా రవీంద్ర చారి, రాష్ట్ర సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పర్వత రెడ్డి, సదానందం గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్యే హాజరు

నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 21: గంగిపల్లికి చెందిన మూల శ్రీనివాస్ కూతురు వివాహానికి గురువారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇక్కడ జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సర్పంచులు రామంచ గోపాల్‌రెడ్డి, రొడ్డ పృథ్వీరాజ్, బీఆర్ఎస్ మానకొండూర్ అధ్యక్షుడు పిట్టల మధు, నాయకులు శ్యాంసన్, అంజి, నాగయ్య, మూల కరుణాకర్ గౌడ్ ఉన్నారు.

ఉపాధిహామీ గ్రామసభ

గంగాధర, డిసెంబర్ 21 : కురిక్యాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉపాధిహామీ గ్రామసభ నిర్వహించారు. చేపట్టే పనులపై చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేచినేని నవీన్‌రావు, గ్రామ పంచాయతీ, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

రేకుర్తి కంటి దవాఖాన సందర్శన

దవాఖానలో లయన్స్ అంతర్జాతీయ అధ్యక్షుడు లయన్ బ్రియన్ షేహ్వాన్

విద్యానగర్, డిసెంబర్ 21 : లయన్స్ అంతర్జాతీయ అధ్యక్షుడు లయన్ బ్రియన్ షేహ్వాన్ ఆయన సతీమణి లోరితో కలిసి గురువారం కరీంనగర్ జిల్లాకేంద్రం శివారులోని రేకుర్తి కంటి దవాఖానను సందర్శించారు. ఈ సందర్భంగా వారు దవాఖానలోని పలు విభాగాలను చూసిన తర్వాత పరికరాలు, శుభ్రతపై అభినందించారు. అనంతరం దవాఖానలో ఏర్పాటు చేసిన 6వ కొత్త ఆపరేషన్ థియేటర్, రోగుల సౌకర్యార్థం నిర్మించిన లిఫ్ట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా దవాఖాన చైర్మన్ కొండ వేణు మూర్తి చేస్తున్న నిర్వహణను కొనియాడారు. కాగా, దవాఖాన ప్రారంభమైన 36 ఏళ్లలో మొట్టమొదటగా ఒక అంతర్జాతీయ అధ్యక్షుడు సందర్శించడం తొలిసారి కావడం గమనార్హం. అంతర్జాతీయ డైరెక్టర్ బాబురావు, డైరెక్టర్ సునీల్ కుమార్, కౌన్సిల్ చైర్మన్ మోహన్ రావు, దవాఖాన చైర్మన్ వేణు మూర్తి, వైస్ చైర్మన్ సురేశ్, కార్యదర్శి ప్రకాశ్‌హోల్లా, కోశాధికారి పవన్‌కుమార్, కార్యవర్గ సభ్యుడు అన్నారెడ్డి పాల్గొన్నారు.

బీసీ గురుకులాల పనివేళలు మార్చాలి

కార్పొరేషన్, డిసెంబర్ 21: మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయాల పనివేళలను ఇతర సంక్షేమ గురుకుల విద్యాలయాలతో సమానంగా మార్పు చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంగయ్య, చావ రవి డిమాండ్ కోరారు. నగరంలోని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం బీసీ గురుకుల ఉపాధ్యాయుల విభాగం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఎస్ శ్రీజన, ప్రధాన కార్యదర్శిగా లివిన్ స్టన్, కోశాధికారిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, సీహెచ్ సతీశ్, మురళి, అరుణాదేవి, స్వర్ణలత, రమేశ్, కార్యదర్శులుగా రమేశ్, సునీల్, సీహెచ్ కృష్ణయ్య, మధు, లింగదాస్, లావణ్య, కార్యవర్గ సభ్యులుగా వినోద్, మాధవి, రమణారెడ్డి, అన్నపూర్ణ, సురేశ్, భాస్కర్, బాలకృష్ణ, భాస్కర్, రవికుమార్, ప్రభాకర్, ఉదయ్, చంద్రశేఖర్, రాజు, అశోక్, సురేశ్, బీ సురేశ్, శ్రీజన, లివిన్ స్టన్ ఎన్నికయ్యారు.

అర్హులందరీతో ఓటరుగా నమోదు చేయించాలి



కలెక్టర్‌కు వివేకానందుడి చిత్రపటం అందజేస్తున్న పల్లవి స్వచ్ఛంద సంస్థ బాధ్యులు

హౌసింగ్‌బోర్డు కాలనీ, డిసెంబర్ 21: జిల్లాలో అర్హులందరీతో ఓటరుగా నమోదు చేయించాలని కలెక్టర్ పమేలా సత్పతి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు సూచించారు. స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్‌ను గురువారం పల్లవి స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షుడు వొడ్నాల రాజు ఆధ్వర్యంలో సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. స్వామి వివేకానంద చిత్రపటం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరీతో ఓటరుగా నమోదు చేయించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ యువజన అవార్డు గ్రహీత సత్తినేని శ్రీనివాస్, పల్లవి స్వచ్ఛంద సేవా సంస్థ నగర మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ అఫ్రోజ్ ఖాన్, మాజీ కార్పొరేటర్ వారాల నారాయణ, కొట్టె మల్లేశం, శ్రీనివాస్, పవన్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి సహకరించాలి

హుజూరాబాద్‌టౌన్ (జమ్మికుంట), డిసెంబర్ 21: జమ్మికుంట పట్టణాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వరరావు కోరారు. గురువారం జమ్మికుంట మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం చైర్మన్ రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వార్డుల్లో చేపట్టే అభివృద్ధి పనులు, బిల్లుల చెల్లింపులు తదితర 9 అంశాలపై సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న, కమిషనర్ శ్రీనివాస్, మేనేజర్ భూపాల్‌రెడ్డి, ఏఈ వరుణ్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యపారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడిగా పిట్టల రవీందర్

పిట్టల రవీందర్

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 21: నగరంలోని రెవెన్యూ గార్డెన్‌లో గురువారం జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం జిల్లా నూతన తాత్కాలిక కమిటీ (అడహక్ కమిటీ) ఎన్నికకు ఎన్నికలు నిర్వహించినట్లు జిల్లా మత్స్య శాఖ అధికారి దేవేందర్ తెలిపారు. కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామానికి చెందిన పిట్టల రవీందర్, సైదాపూర్ మండలానికి చెందిన పెసరు కుమారస్వామి నామినేషన్ దాఖలు చేశారు. కాగా, పిట్టల రవీందర్‌కు 87 ఓట్లు, పెసరు కుమారస్వామికి 55 ఓట్లు పోలయ్యాయి. పిట్టల రవీందర్ జిల్లా తాత్కాలిక అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. ఆయన ప్యానల్‌లో ప్రమోటర్లుగా బాసవేణి శ్రీనివాస్, గుండ కుమార్, పోలు రాజు, గౌడుగు సమ్మయ్య, బోల్ల సుధాకర్, గుడుగ రాజేశం, అరిగె ప్రభాకర్, సమ్మయ్య, నెల్లి రాములు, బాసవేణి శ్రీనివాస్ గెలుపొందినట్లు ప్రకటించారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

కార్పొరేషన్, డిసెంబర్ 21: నగరంలో రాత్రి వేళల్లో ప్రజలు ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతోనే హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు మేయర్ సునీల్ రావు తెలిపారు. నగరంలోని 40, 21వ డివిజన్లలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను గురువారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, అన్ని ప్రాంతాల్లో ప్రజల అవసరాలను గుర్తించి హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు భూమా గౌడ్, బండారి వేణు, జంగిలి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధుల ఆదరణ దినోత్సవం

హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్ 21: హుజూరాబాద్‌లోని బాలవికాస సెంటర్‌లో బాలవికాస, జన వికాస ఆధ్వర్యంలో అనాథ వృద్ధుల ఆదరణ దినోత్సవాన్ని గురువారం నిర్వాహించారు. బాలవికాస కోఆర్డినేటర్ రాణి , అమూల్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అనాథ వృద్ధులకు రూ. 25 వేల విలువైన దుస్తులు, నిత్యావసరాలు, ట్రంకు పెట్టెలు పంపిణీ చేసి, భోజన వసతి కల్పించారు. నాయకులు మొగిలి, నాగరాజ్, మండి రాజా, రాజేశ్వర మండి రూ, 2 వేలు విరాళంగా అందజేశారు. నాయకులు సొల్లు బాబు, లింగయ్య, ఐలయ్య, బాలవికాస ప్రతినిధులు ఎండీ ఖాజాబీ, లీలావతి, రజిత పాల్గొన్నారు.

ములంగూర్ ఖిల్లాకు విద్యార్థుల ఫీల్డ్ ట్రిప్

శంకరపట్నం, డిసెంబర్ 21: ములంగూర్ ఖిల్లాకు మానకొండూర్ మండల కేంద్రానికి చెందిన చాణక్య స్కూల్ విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చారు. 8 నుంచి 10వ తరగతి చదువుతున్న 50 మంది విద్యార్థులు ఖిల్లాపైకి ఎక్కి సందడి చేశారు. ఖిల్లా కింద గల దూద్ బావి నీటిని రుచి చూశారు. పక్కనే గల ఊడల మర్రి కింద ఆడి పాడారు. ఉపాధ్యాయులు ములంగూర్ ఖిల్లా చారిత్రక ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

- చొప్పదండిలో ఘటన
- ధర్మారం మండలం మల్లాపూర్‌లో విషాదం

నగేశ్ (ఫైల్)

హరీశ్ (ఫైల్)

ధర్మారం/చొప్పదండి, డిసెంబర్ 21: కరీంనగర్ జిల్లా చొప్పదండిలోని ఓ పెట్రోల్ బంకు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మల్లాపూర్‌కు చెందిన కూతురు నగేశ్(25), పడిదం హరీశ్(22) దుర్మరణం పాలయ్యారు. గ్రామానికి చెందిన కూతురు రాజమ్మ-పోచ మల్లయ్యకు ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. తల్లిదండ్రులు కొన్నేళ్ల క్రితమే మరణించారు. చిన్న కొడుకు నగేశ్ కరీంనగర్‌లోని ఓ సెల్ పాయింట్‌లో పని చేస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన పడిదం సరోజన-రాజయ్యకు కొడుకు, కూతురు ఉన్నారు. హరీశ్ ఇంటర్ వరకు చదివాడు. త్వరలోనే కువైట్‌కు వెళ్లేందుకు సిద్ధమవుతున్నాడు. గురువారం మధ్యాహ్నం నగేశ్, హరీశ్ కలిసి బైక్‌పై మల్లాపూర్ నుంచి కరీంనగర్ వెళ్తున్నారు. చొప్పదండిలోని పెట్రోల్ బంక్ వద్ద వీరి బైక్‌ను ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. వారి మృతదేహాలపై పడి బంధుమిత్రులు రోదించిన తీరు కలిచివేసింది.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

గన్నేరువరం, డిసెంబర్ 21: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఇక్కడ సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, ఇంగ్లిష్ రీసోర్స్ పర్సన్ శ్రీనివాస్, తెలుగు రీసోర్స్ పర్సన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

24న అథ్లెటిక్స్ జట్టు ఎంపిక పోటీలు

కొత్తపల్లి, డిసెంబర్ 21: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఈనెల 24న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ బాలబాలికల జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనన ధృవీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో మధ్యాహ్నం రెండు గంటలకు అంబేద్కర్ స్టేడియంలో రిపోర్ట్ చేయాలని సూచించారు.

హాకీ పోటీలకు శ్రీ చైతన్య విద్యార్థి ఎంపిక

తిమ్మాపూర్ రూరల్, డిసెంబర్21: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రాజ్ కుమార్ అంతర్ యూనివర్సిటీ హాకీ పోటీలకు ఎంపికయ్యాడు. త్వరలో తమిళనాడులో భారతీదాసన్ యూనివర్సిటీలో జరిగే అంతర విశ్వవిద్యాలయాల హాకీ పోటీలో జేఎన్టీయూ టీం తరుపున రాజ్‌కుమార్ పాల్గొననున్నాడని కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి తెలిపారు. గురువారం రాజ్‌కుమార్‌కు ఆర్థిక సాయం అందిస్తూ పుష్పగుచ్ఛంతో పాటు ట్రాక్ సూట్ బహూకరించి అభినందించారు. ఇక్కడ ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ నరేశ్‌కుమార్, ఏవో రామారావు, స్పోర్ట్స్ ఇన్‌చార్జి గొంటి రమేశ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

సైదాపూర్, డిసెంబర్ 21: వెన్నంపల్లిలో అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ దవాఖాన వరంగల్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దవాఖాన నిర్వాహకులు శ్యాం ఆధ్వర్యంలోని వైద్యబృందం 500 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ అబ్బిడి పద్మారవీందర్‌రెడ్డి, వైద్యులు, గ్రామస్తులు ఉన్నారు.

అల్లునూర్ అబ్బాయి.. శ్రీలంక అమ్మాయి

నూతన జంట అరుణ్‌కుమార్, అజ్జూరా

తిమ్మాపూర్, డిసెంబర్ 21 : ప్రేమకు హద్దులు కుల, మత, ప్రాంత, భాష బేధాలు ఏమీ ఉండవని నిరూపించింది ఈ జంట. దేశాలు వేరైనా ప్రేమించుకుని గురువారం పెళ్లితో ఒక్కటైంది. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ అల్లునూర్‌కు చెందిన అరుణ్ కుమార్ తిమ్మాపూర్‌లోని జ్యోతిష్మతి కళాశాలలో ఇంజినీరింగ్ పూర్తిచేసి పై చదువుల కోసం ఆస్ట్రేలియా వెళ్లాడు. శ్రీలంకలో డిగ్రీ చదివిన అజ్జూరా ఎంబీఏ చదివేందుకు ఆస్ట్రేలియా వెళ్లింది. అక్కడ 2014లో ఇద్దరూ ఒకరికొకరు పరిచయమయ్యారు. ఈ క్రమంలో వారిమధ్య ఏర్పడిన స్నేహం క్రమంగా ప్రేమగా మారింది. తల్లిదండ్రులు వారి ప్రేమలోని నిజాయితీని అంగీకించారు. దీంతో శ్రీలంక అమ్మాయి అజ్జూరాతోపాటు ఆమె తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను తీసుకుని అల్లునూర్‌కు వచ్చాడు. అరుణ్‌కుమార్. ఇరు కుటుంబాల పెద్దల సమక్షంలో గురువారం అంగరంగ వైభవంగా పెళ్లి చేసుకున్నారు.

మక్క సాగుపై రైతులకు అవగాహన

కొత్తపల్లి, డిసెంబర్ 21: మండలంలోని బద్దిపల్లి రైతు వేదికలో కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, అఖిల భారత మక్క పరిశోధన కేంద్రం సౌజన్యంతో గురువారం యాసంగిలో మక్క సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డా. ఉషారాణి, డా. మధుకర్‌రావు, జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డా. రాజేంద్రప్రసాద్, ఏఈవో లలిత, నాగులమల్యాల, బద్దిపల్లి, కొండాపూర్ గ్రామాల రైతులు పాల్గొన్నారు.